# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 295 శుక్రవారం | 07 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





## నకిలీ వైద్యులపై.. దాడులు

ప్రథమ చికిత్స పేరిట మోసం

పలువురిపై కేసులు నమోదు




## ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతా..

నా విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




## గ్రూప్-1 పరీక్షకు.. భారీ భద్రత


వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

## రోగులే లక్ష్యంగా చోరీలు

మహిళ దొంగ అరెస్ట్

బంగారు ఆభరణాలు స్వాధీనం



# మొక్కుబడిగా.. 'ప్రత్యేక' పాలన


వివరాలు 2లో..


## నిధుల లేమితో జీపీలు సతమతం




అభివృద్ధి, మరమ్మతు పనులకు ఆటంకం

మురికి కూపాలుగా మారుతున్న గ్రామాలు

వర్షాలు, సీజనల్ వ్యాధులపై ఆందోళన

జీతాలకోసం కార్యాలయాలకు తాళం వేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 2తో ముగిసిపోగా నాలుగు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. అయితే నిధుల లేమితో గ్రామ పంచాయతీలు నీరసించిపోయాయి. మైనర్ గ్రామ పంచాయతీల్లో సిబ్బందికి కూడా వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. జీతాలు లేకపోవడంతో సిబ్బంది విధులకు కూడా సరిగా రావడం లేదు. దీంతో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లోని పలు వీధులు మురికి కూపాలుగా మారాయి. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామీణులను సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. అభివృద్ధి, మరమ్మతు పనులకు ఒక్క పైసా కూడా లేని పరిస్థితి నెలకొంది. వీరి పాలనకు ముందే పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవడంతో పాలన అటకెక్కింది. కొందరు పంచాయతీ కార్యదర్శులు జేబు నుంచి పెట్టి చిన్నచిన్న పనులు చేయిస్తున్నారు. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్న భావన వ్యక్తమవుతోంది.

- వరంగల్ వాయిస్, మహబూబాబాద్




## అమ్మవారిని దర్శించుకున్న సురేఖ

భద్రకాళికి ప్రత్యేక పూజలు

# మొక్కుబడిగా.. 'ప్రత్యేక'పాలన



**నిధుల లేమితో జీపీలు సతమతం**

**అభివృద్ధి, మరమ్మతు పనులకు ఆటంకం**

**మురికి కూపాలుగా మారుతున్న గ్రామాలు**

**వర్షాలు, సీజనల్ వ్యాధులపై ఆందోళన**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గ్రామ పంచాయతీలు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. కార్మికుల వేతనాలు, తాగునీటి సరఫరా నిర్వహణ, పారిశుద్ధ్యం, పంచాయతీల్లో ట్రాక్టర్ కంతుల చెల్లింపులు జరిపేందుకు కావాల్సిన నిధులు లేక కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలంటూ ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించేవారే కరువయ్యారు. నిధులు ఎలా సమకూర్చుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా మార్గం ఉంటే సూచించాలంటూ స్థానిక లీడర్లను కోరుతున్నారు. గ్రామంలో ఎవరితోనైనా నిధులు సర్దుబాటు చేస్తే ప్రభుత్వం నుంచి నిధులు రాగానే తీసుకోవచ్చంటూ సలహా ఇస్తున్నారు. ఒక్కో కార్యదర్శి రెండు మూడు గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించడంతో ప్రజలనుంచి వచ్చే ఒత్తిడి నుంచి తప్పించుకు తిరుగుతున్నారు.

### చేతులెత్తేస్తున్న కారదర్శులు..

పారిశుధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు, పంచాయతీ ట్రాక్టర్ నెలవారి బ్యాంకు కిస్తీ, గ్రామంలో విద్యుత్ దీపాలు, నెలనెలా విద్యుత్ బకాయిలు ఇవన్నీ ఖచ్చితంగా చె ల్లించాల్సిందే. ఈ బరువు బాధ్యతల గురించి ప్రత్యేక అధికారులు చేతులెత్తేసే తరహాలో వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులే భుజాన వేసుకుని వారికి వచ్చే జీతంలో కొద్దో, గొప్పో కార్మికులకు సగంసగం జీతం సర్దుబాటు చేస్తున్నట్లు ఓ పంచాయతీ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒక్కో గ్రామ పంచాయతీ రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అప్పులు చేసి అభివృద్ధి పనులకు వెచ్చించినట్లు సమాచారం. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు ఖర్చుల విషయంలో తప్పించుకు తిరగడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతుంది. నాలుగు రోజులు ఉండి వెళ్లిపోయే వాళ్లమని ప్రత్యేక అధికారులు దాటవేస్తున్నారు.

### ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీకి మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్థిపన్ను జమ చేసుకునే ఖాతా... గ్రామాల్లో ఆస్థిపన్ను వసూలు అంతంతమాత్రంగా జరగడం, ఖర్చులు నాలుగు రెట్లు అదనంగా ఉండటంతో ఇది ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్సీ. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ గత సర్కారు హయాంలో ఎస్ఎఫ్సీ నిధులు అరకొర మంజూరుతోనే సరిపెట్టింది. మూడో ఖాతా 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ అవుతాయి. కేంద్ర సర్కారు నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ప్రాతిపదికన జమ చేస్తుంది. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి వీటిని అందజేస్తుంది. కేవలం ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండడం. వీటిని ప్రత్యేక పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.




**ప్రభుత్వ కార్యాలయానికి తాళం**

జీతాలు చెల్లించాలంటూ జీపీ ఉద్యోగుల ధర్నా



**చీ.. చిల్కోయల 'పాడు'**

- రోడ్డుపై పారుతున్న మురుగు నీరు
- దుర్గంధం వెదజల్లుతున్న సైడు కాలువలు
- భరించలేకపోతున్న ప్రజలు

### జీతాలకోసం..

నిధులు లేమితో సిబ్బంది జీతాలు చెల్లించడమే కష్టంగా మారుతోంది. గత నాలుగైదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది రోడ్డెక్కుతున్నారు. ధర్నాలు, రాస్తారోకోలకు సిద్ధపడుతున్నారు. పస్తులతో కాలం గడుపుతున్నామంటూ మొరపెట్టుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామ పంచాయతీ సిబ్బంది కార్యాలయ సిబ్బంది వేతనాలకోసం ఇటీవల పంచాయతీ కార్యాలయానికే తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు అనేక గ్రామ పంచాయతీల్లో నెలకొంది.

**గ్రామం పంచాయితీల తీరుపై ఇటీవల 'వరంగల్ వాయిస్' లో ప్రచురితమైన కథనాలు..**

# నకిలీ వైద్యులపై.. దాడులు

**వరంగల్ వాయిస్, మరిపెడ :** జాతీయ, రాష్ట్ర వైద్యమండలి సంయుక్త ఆదేశాల మేరకు వైద్య టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డాక్టర్ వేములపల్లి నరేష్ కుమార్, ఆంటీ కరెప్షన్ బృందం డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, డాక్టర్ సెంకేశి శిరీష్ బృందం శుక్రవారం మరిపెడ బంగ్లాలోని పలు ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం, ఎటువంటి విద్యార్హత లేకుండా పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకొని వచ్చి రాని వైద్యం చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి విద్యార్హత లేకుండానే కంపాటి రవి బాబు ఎంబీబీఎస్ వైద్యుని స్థాయిలో రవి క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స చేస్తూ మోసం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. అలాగే డయాగ్నోస్టిక్ సెంటర్, మందుల షాప్ నిర్వహిస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. వైద్య అధికారుల కండ్లు గప్పి హాస్పిటల్ నడుపుతున్నాడన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా రామారావు క్లినిక్ పేరిట నకిలీ వైద్యం చేస్తున్న ఇస్లావత్ రామారావు, బీవీనాయక్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు బీవీనాయక్ లు ఎంబీబీఎస్ డాక్టర్ల స్థాయిలో బోర్డులు, ఫొటోలు పెట్టి ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారన్నారు. శ్రీనివాస ప్రథమ చికిత్స కేంద్రం పేరిట ఐ.వీరన్న నాయక్ కూడ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ముసుగులో అధిక మొత్తంలో నొప్పి నివారణ ఇంజెక్షన్లు, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. వీరిపైన ఎన్ ఎంసీ చట్టం 34,54 ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు వైద్య మండలి అధికారులు తెలిపారు.

### పలు కేంద్రాలకు తాళాలు..

అధికారులు వస్తున్నట్టు తెలుసుకున్న కొంత మంది వారి కేంద్రాలు



మూసి పారిపోయారు. ఈ ముగ్గురిపైన రాష్ట్ర కౌన్సిల్ లో ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీరు ప్రథమ చికిత్స కేంద్రాల ముసుగులో చట్ట వ్యతిరేకంగా ఆపరేషన్ లు చేయడం, రహస్య గర్భ విచ్చిత్తి ఆపరేషన్స్, మోకాళ్ళ నొప్పులకు అధిక మోతాదులో స్టెరాయిడ్ ఇంజెక్షన్స్ ఇస్తున్నారని, వీరిపై నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని మరోసారి జిల్లా అధికారుల సహకారంతో వీరి కేంద్రాలపై కూడా తనిఖీ నిర్వహిస్తామని తెలియచేశారు. హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ వరంగల్ ప్రెసిడెంట్ డాక్టర్ కొలిపాక వెంకటస్వామి మాట్లాడుతూ వైద్య పట్టా లేకుండా వైద్యం ఎవరు చేయరాదని, పారామెడికల్ కోర్సు చేసినవారు ప్రాథమిక చికిత్స మాత్రమే చేసి వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. వారి పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోరాదన్నారు. ఇంజెక్షన్లు ఇవ్వడం, సెలైన్ లు పెట్టడం నేరం అన్నారు. ప్రిస్క్రిప్షన్ రాయకూడదన్నారు. క్వాలిఫైడ్ డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలని మందుల దుకాణం యజమానులకు సూచించారు.

# గ్రూప్-1 పరీక్షకు.. భారీ భద్రత

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** జూన్ 9వ తేదీ ఆదివారం నిర్వహించనున్న గ్రూప్%-%1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు పోలీస్ శాఖ భద్రతా పరమైన అన్న ఏర్పాట్లు చేసిందన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 76 సెంటర్లలో 35 వేల మంది గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కానున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నేరమన్నారు. ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వర్షాలకు ముందే మరమ్మతు పనులు

## మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బ తిన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థలను రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు మంత్రి ఉత్తమ్ వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల కాళేశ్వరంపై రివ్యూ జరగలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ కుంగింది. అయినప్పటికీ రూ.94 వేల కోట్ల అప్పుకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీని సంప్రదించి పరిశీలన చేయమని కోరాం. నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసింది. మేడిగడ్డ కుంగిన వెంటనే గేట్లు ఎత్తి ఉంటే ఇంత డ్యామేజీ జరిగేది కాదని తేల్చింది. దెబ్బతిన్న చోట్ల కొన్ని రిపేర్లు చేసి అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని చెప్పింది. ఆ పనుల పరిశీలన చేయడానికి వచ్చా. మేడిగడ్డ, అన్నారం వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

## బొగ్గుల వాగు శివారులో చిరుత సంచారం



**వరంగల్ వాయిస్, మల్హర్:** మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గుల వాగు సమీపంలోని గోపయ్య కుంట వాగులో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. శుక్రవారం ఉదయం చాపల వేటకు వెళ్లిన కొందరు వ్యక్తులకు చిరుత పాద ముద్రలు కనిపించడంతో వారు మీడియాతో పాటు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది చిరుత సంచరించినట్టు గా ఉన్న ప్రాంతాన్ని, చిరుత అడుగు జాడలను పరిశీలించారు. గత వారం పెద్దపల్లి జిల్లాలో చిరుత సంచరించగా అదే చిరుత ఇటు వైపు రావచ్చని అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. గత రాత్రి బొగ్గుల వాగు సమీపంలో వర్షం కురవడంతో పాద ముద్రల ఆనవాళు స్పష్టంగా కనపడటం లేదని, సరైన ఆధారాలు లభించనప్పటికి చిరుత సంచరించే అవకాశం ఉంది. కాబట్టి, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం ఉంటే అటవీ అధికారులకు తెలియజేయాలని కొయ్యూరు రెంజర్ కిరణ్ కుమార్ తెలిపారు. అటవీ సిబ్బంది కూడా చిరుత ఆనవాళ్లు కనుగొనే పనిలో ఉన్నారని, త్వరలోనే చిరుత సంచారానికి సంబంధించి పూర్తి సమాచారం తెలిసే అవకాశం ఉందని వారు తెలిపారు.

## పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి

### సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవటం ఎంత ముఖ్యమో దాని పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవాన్ని (వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే) పురస్కరించుకొని జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆహార పదార్థాలకు తయారు చేసే పాత్రలతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రంగా కడిగిన తర్వాతే పోషక విలువలు పోకుండా తగినంత ఉడికించుకోవాలని, ప్రత్యేకించి మాంసాహార పదార్థాలను తగినంతగా ఉడికించాలని, అశుభ్రమైన పదార్థాలు తినడం వల్ల వల్ల ఆరోగ్యం పాడవటంతో పాటు అనేక వ్యాధుల బారిన పడవలసి ఉంటుందని తెలిపారు. వీలైనంత వరకు ఇంటి భోజనమే సురక్షితమన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్న హోటల్ ఫుడ్ తినటం వలన, ముఖ్యంగా పిల్లలు జంక్ ఫుడ్ అతిగా తీసుకోవటం వలన ఆరోగ్యానికి హాని జరుగుతుందన్నారు. హనుమకొండలోని మల్లికాంబ మానసిక వికలాంగుల పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులకు ఆహార పదార్థాలు అవసరం ఉందని విందులలో మిగిలిన ఆహార పదార్థాలను వారికి అప్పగిస్తే ఆ చిన్నారుల ఆకలి తీర్చినట్లు అవుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి సమాచారం కోసంచరవాణి నెంబర్ 99497 09866 లో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

## గాయపడ్డ గుజరాత్ క్రీడాకారిణి

### చికిత్స చేసిన డాక్టర్ విజయచందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** కాకతీయ యూనివర్సిటీ మైదానంలో జరుగుతున్న తెలంగాణ వర్సెస్ గుజరాత్ క్రికెట్ మ్యాచ్ లో గుజరాత్ టీంకు చెందిన క్రీడాకారిణి ఆశాచౌదరి గాయపడ్డారు. వెంటనే వారిని రోహిణి హాస్పిటల్ కు తరలించడంతో అక్కడే ఉన్న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ఆమెకు చికిత్స అందించారు. డాక్టర్ పెసరుకు గుజరాత్ టీమ్ పక్షాన క్రీడాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి జయపాల్, ఝాన్సీ, సుమంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత మాటలతో కాంగ్రెస్ గెలిచింది



### బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీజేపీకి ఓటు వేసి అండగా నిలిచి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ఎంపీల సహకారంతో ఓరుగల్లును మరింత అభివృద్ధి చేస్తామని బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్ లోని వేద ఫంక్షన్ హాల్ లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి అధ్వర్యంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ ఎండను సైతం లెక్క చేయకుండా మొన్నటి ఎన్నికల్లో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. డబ్బులు, మద్యం మాంసం వెదజల్లి కాంగ్రెస్ గెలిచిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ ఎంపీల సహకారంతో ఓరుగల్లు అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మోదీ నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మోసపూరిత మాటలతో కాంగ్రెస్ గెలిచిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు. సమావేశంలో బీజేపీ క్లస్టర్ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ డా.టి.రాజేశ్వర్ రావు, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, నాయకులు కొలను సంతోష్ రెడ్డి, గడిపల్లి రాజేశ్వర్ రావు, గాదె రాంబాబు, కందగట్ల సత్యనారయణ, ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, కడవేరు శ్రీనివాస్, జైపాల్, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీ ప్రతిపాదించిన రాష్ట్ర చిహ్నాన్ని ఆమోదించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** డీఎస్పీ ప్రతిపాదించిన రాష్ట్ర చిహ్నాన్ని ఆమోదించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు మండలంలోని తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల నాయకుడు బుస్స తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తూ ఆస్థానంలో కొత్త చిహ్నం తీసుకురావాలని ప్రకటించడాన్ని మేము స్వాగతిస్తున్నామన్నారు. వివిధ పార్టీలు, సంస్థల నుంచి కూడా ప్రతిపాదనలు ప్రభుత్వం ఆహ్వానించిన నేపథ్యంలో ధర్మ సమాజ్ పార్టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక చిహ్నాన్ని ప్రతిపాదించామని తెలిపారు. హక్కుల కోసం యుద్ధం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క, సారలక్క ల చిత్రాలను కూడా ఈ తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదిత చిహ్నంలో ఉంచామన్నారు. ఈ ప్రతిపాదిత చిహ్నంలో ఉంచిన ఈ ఆరు చిత్రాలు సమాజంలో సమానత్వ భావననీ, పీడిత వర్గాల యోధుల పోరాట స్ఫూర్తి కనిపిస్తుందని, భావితరాల తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి అవుతుందని తెలిపారు. కాబట్టి, ఈ చిహ్నాన్ని ఆమోదించి తెలంగాణ ప్రజల పట్ల సమానత్వ భావన ఉందని తెలియజేయండని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, మేకల ప్రవీణ్, దినేష్, తిరుపతి పాల్గొన్నారు.

## ఆందోళనకు దిగిన రైతులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్ వద్ద పర్వతగిరికి చెందిన దళిత రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. రిజర్వాయర్ కు ఉన్న రెండు తూములకు షట్టర్లను ఇరిగేషన్ అధికారులు సరిగా ఫిట్టింగ్ చేయకపోవడంతో గత మూడు సంవత్సరాల నుంచి తాము పంటలు పండించుకోకుండా ఉన్నామని వాపోయారు. 24 గంటలు ఈ తూములలో నుంచి నీరు బయటకు వచ్చి తమ పంట పొలాల మీదుగా వెళుతున్నాయని, దీంతో పంటలు వేసుకోలేని దుస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. సుమారు 50 ఎకరాల వరకు తాము నష్టపోతున్నామని, ఎన్నిసార్లు ఆఫీసర్లకు, ప్రజా ప్రతినిధులకు చెప్పిన పట్టించుకోవడం లేదని రైతులు బొట్ల వెంకన్న, అర్షమ్ జయమ్మ, కాసర్ల ప్రభాకర్, బొట్ల పుష్పమ్మ, సింగారపు యాకయ్య, చేరాలు, దర్గయ్య, కనుక రాజు తదితరులు ఆరోపించారు. ఇప్పటికైనా ఆఫీసర్లు తూములను సరి చేస్తే వానాకాలం పంటలు పండించుకుంటామని కోరుతున్నారు. అంతేకాక, తూము వద్ద నుంచి పూల కమ్మ చెరువు వరకు సీసీతో కాలువ నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

# విత్తనాల కుంభకోణంపై విచారణ జరిపించండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల వ్యవసాయ శాఖలో జరిగిన విత్తన కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం, పార్టీ ప్రతినిధి బృందం తొర్రూర్ డిప్యూటీ ఎమ్మార్వో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1600 బస్తాలను రైతుల పేరుతో భోగస్ అగ్రోస్ ద్వారా అమ్ముకున్న అధికారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, అన్ని శాఖల అధికారులు ప్రైవేట్ షాప్ లలో తనిఖీల పేరుతో హడావుడి చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. తూతూ మంత్రంగా విచారణ చేయిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన విచారణ పూర్తి చేసి దోషులను క్రిమినల్ కేసులకు పెట్టాలని అన్నారు. 2 లక్షల రైతు రుణమాఫీని వెంటనే అమలు చేసి నూతన రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐఎంల్ మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముందంపల్లి వీరన్న మాట్లాడుతూ ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం రైతు పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించి అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేదంటే ఆందోళన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పల్లెల పాపారావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు అనిల్ తో పాటు గజ్జి యాకయ్య, సాయిలు, మధు, వెంకన్న, యాకమ్మ పాల్గొన్నారు.

# రైల్వే శాఖ మంత్రి పదవీ తెలంగాణ ఎంపీలకు కేటాయించాలి

## తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్

**వరంగల్ వాయిస్, కాజీపేట :** రైల్వే శాఖ మంత్రి పదవిని తెలంగాణ బీజేపీ ఎంపీలలో ఒకరికి ఇవ్వాలని తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ (మూసి వేయబడిన ) ఆవరణలో ప్రెస్ మీట్ నిర్వహించారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిశాఖ అయిన క్యాబినెట్ రైల్వే శాఖ మంత్రిగా తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఎవరు ఆ శాఖను నిర్వహించలేదన్నారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ "ఎన్డీఏ" ప్రభుత్వం పది సంవత్సరాలు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం నుంచి మొదటి ప్రభుత్వంలో సహాయ మంత్రిగా, రెండోసారి క్యాబినెట్ పర్యాటక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డికి మాత్రమే అవకాశం వచ్చిందన్నరు. ఆ సమయంలో తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలు నలుగురు మాత్రమే ఉన్నారు. కానీ, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజానీకం ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించారని తెలిపారు. కాబట్టి దేశంలోనే అతి కీలకమైన క్యాబినెట్ రైల్వే శాఖమంత్రి పదవిని తెలంగాణలో గెలిచిన బీజేపీ ఎంపీలలో సమర్థులైన వారికి కేటాయించాలని తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కోరుతుంది. తెలంగాణ ఎంపీలలో సమర్థులైన ఒకరికి రైల్వే క్యాబినెట్ మంత్రిత్వ శాఖను కేటాయించినట్లయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని




ఆశాభావం వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, కాజీపేట కరీంనగర్ రైల్వే లైను, మిర్యాలగూడ నల్గొండ రైల్వే లైను ఏర్పాటు కోసం వారు కృషి చేస్తారని నమ్మకం ఉందన్నారు. కాబట్టి తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ తరపున 9న కొలువు తీరనున్న భారత ప్రభుత్వంలో ఈ తెలంగాణ బీజేపీ ఎంపీలకు ప్రాధాన్యతనిచ్చి ఈ ప్రాంతం వారికే క్యాబినెట్ రైల్వే శాఖ మంత్రిత్వ పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో కన్వీనర్లు రేండ్ల రమేష్, చింత తిరుపతి, కేఎన్ రావు, తప్పేట సారయ్య, వైస్ చైర్మన్లు పి.రమేష్, జిట్టా రాజలింగం, జి.భాస్కర్, ఎస్. లక్ష్మీనారాయణ, జి.మాణిక్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లు వరంగల్‌లో జరిగేలా కృషి చేయండి

## మంత్రిని కోరిన శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని రిజిస్ట్రేషన్లను వరంగల్ కార్యాలయంలోకి వచ్చే విధంగా, నిర్వహణ చేయుటకు కృషి చేయాలని మంత్రి కొండా సురేఖ ను కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ ఓసీటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత 7 సంవత్సరాల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రిజిస్ట్రేషన్ నిమిత్తం సామాన్య ప్రజలు హనుమకొండకు వెళ్లి వ్యయప్రయాసకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పనిసరిగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రికి ఈ సందర్భంగా న్యాయవాది శామంతుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే నాగరాజుకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడంలో వర్ధన్నపేట నియోజకవర్గం క్రియాశీలక పాత్ర పోషించి ఎంపీ కడియం కావ్యకు భారీ మెజారిటీ తీసుకురావటంలో కృషి చేసిన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కాంగ్రెస్ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మెట్టుగుట్ట దేవస్థాన చైర్మన్ పైడిపాల రవి చందర్, వైస్ ఎంపీపీ బిల్లా రవీందర్, 46 , 64వ డివిజన్ల నాయకులు వస్కుల నాగరాజు, వస్కుల శ్రీను, వస్కుల శివ, కృష్ణ, శ్రీనివాస్, మల్లికార్జున్, రాజు లింగరాజు, గౌడ్ అర్జున్, తదితరులు ఉన్నారు.

# లారీ యజమానుల, కార్మికుల సంక్షేమమే లక్ష్యం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** లారీ యజమానుల, కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ది కాకతీయఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే జీఎస్సార్ పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ వారి కార్యాలయంలో టెంకాయ కొట్టి, వేదికపై నూతనంగా ఎన్నికైన ఐదుగురు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా నూతన కార్యవర్గం సంఘం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. లారీ యజమానులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెన్నంటే ఉండి కాపాడుకున్నామన్నారు. లారీల మీద ఆధారపడి వందలాది కార్మికుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, లారీ ఓనర్లు, డ్రైవర్లు ఉన్నారు.

# నీతోనే జన్మ పాటను విడుదల చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లి గ్రామంలోని హజ్రత్ నురుద్దీన్ ఖదీర్ బాబా దర్గాలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవరం చాదర్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్ బాషా ఆధ్వర్యంలో నీతోనే జన్మ పాటను విడుదల చేసి నటీనటులకు, పాట చిత్రీకరించిన యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను శిభారాణి–అనిల్ కుమార్, జిల్లా నాయకులు నల్గొండ రమేష్ గౌడ్, పరమేష్, మాజీ పీఎస్సీఎస్ చైర్మన్ బుద్ధ వెంకన్న, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, పార్టీ నాయకులు జన్ను అరుణాకర్, ఎస్కే జావిద్, పురాణం రవి, ముచ్చర్ల స్టాలిన్, పైసా మహేష్, బూర సారంగపాణి, వినయ్, శివ, కుమార్ మైనారిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'మర్కజి పాఠశాలలో చేర్పించండి'




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గుండ్ల సింగారంలో ఇంటింటి సర్వే, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు .ఇల్లిల్లు తిరుగుతూ తల్లిదండ్రులను కలిసిన ఉపాధ్యాయులు ఈ సంవత్సరం పదవ తరగతిలో సాధించిన అత్యుత్తమ ఫలితాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విశేష అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ బుక్కులు, రెండు జతల యూనిఫామ్ లు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇలా అనేక రకాల సదుపాయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. తమ పాఠశాలలో చదివే పిల్లలకు ఎన్ సీసీ ఆర్మీలో చేరే అవకాశం ఉందన్నారు. చక్కటి కంప్యూటర్ ల్యాబ్ ,సైన్స్ ల్యాబ్, వేలాది పుస్తకాలు కలిగిన లైబ్రరీ, ఆటపాటలతో విద్య మొదలగు అవకాశాలు ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో చదివే పిల్లలకు సమకూరుస్తున్నామన్నారు. కాబట్టి, తల్లిదండ్రులు గ్రామంలో ఉన్న పెద్దలు తమ పిల్లలను ఒకటి నుంచి పది వరకు ఆంగ్ల మాధ్యమంలో చదివించడానికి తమ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రామారావు నేతృత్వంలో బడిబాట కార్యక్రమంలో వలస పైడి, డాక్టర్ కె.వాసు, ఎడ్ల శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో రెండవ రోజు బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు హ్యాండ్ మైకు పట్టుకుని గ్రామంలో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలను తెలియజేస్తూ ఇల్లు ఇల్లు తిరుగుతూ విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ తల్లి తండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్య లభిస్తుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో మీ బిడ్డపై పెట్టే ఖర్చు ప్రస్తుతం పొదుపు చేసినట్లయితే వారి ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, శీలం సరిత, తాళ్లపల్లి మంజుల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 192 పక్షాన చిప్ప వెంకటేశ్వర్లు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆధ్వర్యంలో గిర్మాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించి ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలన్నారు. పిల్లలకు చక్కని చదువు అందించడానికి తల్లిదండ్రులు తప్పక ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఇంగ్లీషు మాధ్యమంలో బోధన, క్రీడలలో శిక్షణ, మొదలైన కృత్యాలు విద్యార్థులకు అందజేయబడుతున్నాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అల్లే ఎండీ దస్తగిరి జడ్సీ, అల్లే పెంట కుమార్ డీసీఎస్, ప్రముఖులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖను కలిసిన బలగం మొగులయ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బలగం సినిమా ఫేం మొగులయ్య దంపతులు శుక్రవారం కలిశారు. వారి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఆర్థిక సాయం చేసి ఎంజీఎం సూపర్డెంట్ తో మాట్లాడి బలగం మొగలియ్యకు మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం సూపరెండెంట్ కు చెప్పారు. వెంటనే ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చుకొని బలగం మొగలియ్యకు చికిత్స అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు శంకర్ రెడ్డి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన పల్లకొండ ఐలయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆదర్శ కాలనీ వాసులు శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పరామర్శించి 1క్వింటాన్ బియ్యంతో పాటు రూ.10 వేల విలువచేసే వస్తు సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఇళ్ల సూరయ్య, గోడిశాల సురేందర్ గౌడ్, కాలే రాములు, కోరే రవి ,ముదురు రమేష్, కంది నారాయణరెడ్డి, ఎర్ర రవీందర్, పులి రమేష్, కుసుమ సారంగం, ఇళ్ల ప్రసాద్, ఆరే శివయ్య, ముత్యం రాజు, నరిగే రవి, నరిగే శివరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కడియం కావ్యకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ దైవజనులు కార్యవర్గ సభ్యులు కలిసి కడియం కావ్యకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురి విజయానికి పాస్టర్లు ఎంతో కృషి ప్రార్థనలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ కే జేమ్స్, సెక్రెటరీ యోబు, ట్రెజరర్ జి ప్రతాప్, చైర్మన్ జి మార్క్ పీటర్, ఎస్ఎల్ ఆనంద్, ప్రెసిడెంట్ మత్తయి, ఐజయ్య, పి.జార్జ్, ముఖ్య సలహాదారులు సీహెచ్ కృపాల్, జాయింట్ సెక్రెటరీ ప్రేమ్ కుమార్, ఆర్గనైజర్స్ జాషువా, వినయ్ కుమార్, డబ్ల్యూసీపీఏ మీడియా కన్వీనర్ ఎస్ రాజు, దైవజనులుజి.జాన్, సంసోను, భాస్కర్, దైవజనులు రెవరెండ్ ఎం.శేఖర్ పాల్గొన్నారు.

## ఎండీ ఇర్ఫాన్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోవా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 గోల్డ్ ,సిల్వర్ మెడల్స్ సాధించిన గోల్డెన్స్ కిడ్స్ విద్యార్థి ఎండీ ఇర్ఫాన్ ను గురువారం సాయిబాబా మందిరంలో ధర్మకర్తలు రాకం సదానందం నిమ్మల శ్రీనివాస్ ఘనంగా సన్మానించి అభినందించారు. చిరుప్రాయంలోనే తాను సాధించిన విజయాలను ప్రతి ఒక్క విద్యార్థి స్ఫూర్తిగా తీసుకొని ఆత్మరక్షణకై కరాటే మార్షల్ ఆర్ట్స్ విద్యను నేర్చుకోవాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు చిన్నారిని అభినందించారు

## మంత్రి సురేఖను కలిసిన నగర మహిళా కాంగ్రెస్ కమిటీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరానికి చెందిన సుల్తానా సమ్మక్క, పల్లకొండ రాజమణి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మంత్రి అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వరంగల్ క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ సిటీ మహిళా కాంగ్రెస్ కమిటీలో పదవులు ఇచ్చినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.


# పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలపై నిర్లక్ష్యం

### దుర్గంధపు నీడలో తరగతి గదులు


### పట్టించుకోని అధికారులు

### ఏబీవీపీ వరంగల్ మహానగర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని పెగడపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని పరిసరాల పరిశుభ్రతను అధికారులు గాలికొదిలేశారు. మూడు గ్రామాలకు కలిపి ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే, పెగడపల్లి గ్రామానికి సంబంధించిన డ్రైనేజీ స్కూలు ఆవరణంలో నుంచి తరగతి గదులకు ఆనుకొని వేయడంతో ఆ నీరు పాఠశాల ఆవరణలో నిలవడంతో విద్యార్థులు తరగతి గదులలో ఉండలేక పోతున్నారు. తరగతి గది కిటికీలకు వాసన రాకుండా అట్టలను అడ్డుపెట్టుకొని కాలం



గడుపుతున్నారు. దీనికి సంబంధించి గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నోసార్లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పాఠశాల వేసవి సెలవులు ముగించుకొని ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని డ్రైనేజ్ వ్యవస్థను స్కూల్ బయట నుంచి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలోచెత్తాచెదారం మొత్తం స్కూల్ ఆవరణలోకి భారీగా చేరుతుంది. క్రిమి కీటకాలు, పాములు స్కూల్ తరగతి గదిలోకి కూడా రావడం జరిగింది. ఎంతోమంది విద్యార్థులు ఆ దుర్వాస వలన అనారోగ్యానికి గురై స్కూల్ కి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. స్కూలు ఉపాధ్యాయులు ఆ దుర్వాసనతో తరగతి గదులలో ఉండకుండా బయట ఎండలో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితి ఉంది. గత ఐదు సంవత్సరాల నుంచి ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

### ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేడు ప్రజావాణిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని ఎన్ హెచ్ఎం ఉద్యోగులు కలిసి తమను రెగ్యులరైజ్ చేయాలని, 510 జీఓలో 4000 మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఎన్ హెచ్.ఎం.కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 2018లో 510 జీఓలో కొంతమందికి అన్యాయం జరిగిందని తెలిపారు. 510 జీవోలో అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని ప్రణాళిక సంఘం, త్రిసభ కమిటీ మెంబర్ చిన్నారెడ్డికి 510 జీవో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాన్ 510 జీవోను తయారుచేసి త్రిసభ కమిటీ మెంబెర్ చిన్నారెడ్డికి సబ్మిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగ చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎవరికైతే





అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 510 జీవోలో అన్యాయం జరిగిన వారందరికీ సమాన పనికి సమాన వేతనంతో పాటు, క్యాడర్ ఫిక్సేషన్ చేసి 2018 నుంచి అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పల్లె దావఖాన డాక్టర్స్ డిజిగ్నేషన్ చేంజ్ చేయగలరని, వారికి రూ.40 వేల వేతనమే వస్తుందని, 30శాతం పీ ఆర్సీ కలిపి రూ.52,000 వేతనం చేయాలని డాక్టర్ పుట్ట మహేందర్ రావు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.సురేష్ గౌడ్, వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ జన్ను కోర్నల్, లోకేష్, పల్లె దావఖాన వైద్యాధికారి డాక్టర్ పుట్ట మహేందర్ రావు, దామల ప్రవీణ్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలను కాపాడాలి

### డోర్నకల్ సీఐ ఉపేందర్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డోర్నకల్ సీఐ బంధం ఉపేందర్ అన్నారు. ఖాజా బాయి మెమోరియల్ అధ్వర్యంలో మండలంలోని గొల్లచర్ల గ్రామంలో రెండు తెలుగు రాష్ట్రముల కబడ్డీ పోటీలను అయన శుక్రవారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ లాంటి గ్రామీణ క్రీడల వల్ల గ్రామాల్లో సేహ్నపూరిత వాతావరణం పెంపోందుతుందన్నారు. క్రీడలు శారీరకతో పాటు మానసిక ఉల్లాసం పెంపుకనకు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మానుకోట కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు మద్ది వెంకట్ రెడ్డి, కార్యదర్శి సంద వీరన్న, గంధసిరి శ్రీనివాస్, గొర్ల సత్యనారాయణ రెడ్డి, సత్తిరెడి, కోటిలింగం, భిక్షం రెడ్డి, సమ్మిరెడ్డి, లాలు నాయక్, శంకర్, కన్న, భీమనబోయిన సంతోష్, కోడవండ్ల యాదగిరి, చెటుపల్లి ఉప్పయ్య, తోట ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, గొడుగు సురేష్, చంద మహేష్, భీమనబోయిన శ్రీశైలం, సాగర్ సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంపీపీ బాదావత్ విజేందర్, ఎంపీడీఓ బి.గోవిందరావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల ప్రధానోపాధ్యాయులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ బాదావత్ విజేందర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని తెలిపారు. అలాగే ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలలో అమ్మ ఆదర్శ మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే ఎంఈఓ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ బడిబాట కార్యక్రమంలో అందరూ పాల్గొని విద్యార్థులను అధిక సంఖ్యలో పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రభాకరరావు, భద్రయ్య, రవీందర్ రెడ్డి, సురేందర్ గౌడ్, కొమురయ్య, యాకయ్య, కట్టస్వామి, అనిల్, కృష్ణమూర్తి, ప్రజా ప్రతినిధులు గోపాల్ నాయక్ , రమేష్, ఎంఆర్ సీ సిబ్బంది, సీఆర్పీలు, మండల సమైక్య సిబ్బంది, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఏఎస్సై గండి సదయ్యకు ఘన సత్కారం

**వరంగల్ వాయిస్, కొత్తగూడెం :** ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై గండి సదయ్యను బంధుమిత్రులు, సహచరులు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని పెద్దమ్మగుడి సమీపంలో విజయకృష్ణ ఫంక్షన్ హాల్ లో రిటైర్డ్ ఏఎస్సై సదయ్య సన్మాన కార్యక్రమానికి వాఖ్యాతగా తాటికొండ వీరస్వామి వ్యవహరించగా ముఖ్య అతిథిగా కొత్తగూడెం డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ప్రత్యేక ఆహ్వానితులుగా రిటైర్డ్ డీఎస్పీ రాపర్తి బుచ్చయ్య గౌడ్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ రావు, పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ విజిలెన్స్, సెక్యూరిటీ, ఫైర్ డీఎస్పీ నలుబోల రమేష్, పాల్వంచ రూరల్ ఎస్సై శ్రీనివాస్, లక్ష్మీదేవి పల్లి పోలీసు సిబ్బంది, డీసీఆర్బీ సిబ్బంది హాజరై గండి సదయ్యను





ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గండి సదయ్య తన వృత్తి జీవితంలో సాధించిన కీర్తిని కొనియాడారు. తన ఉద్యోగ విరమణ అనంతరం జీవితం కుటుంబంతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గండి సదయ్య మాట్లాడుతూ తన వృత్తి జీవితంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, కుటుంబసభ్యులు గండి కొంరయ్య-సమ్మక్క, పూజారి సాంబయ్య-సాంబలక్ష్మి, తాటికొండ వీరస్వామి-వాణి, పూజారి రాజయ్య-చంద్రకళ, పూజారి విజయ్ కుమార్-సుజాత, పూజారి శ్రీనివాస్-శ్రీలత, సుధగాని అశోక్-రమ, కాసగోని సదానందం-మంజుల, బొనగాని కృష్ణ-మంజుల, జూలూరి సాంబయ్య-ఈశ్వరమ్మ, గంగిరేణిగూడెం, మాందారిపేట బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మహర్షి పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల లోపల పుస్తకాలు, నోట్ బుక్స్,టై, బెల్ట్ సామాగ్రి అమ్ముతున్న మహర్షి పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, వీజేఎస్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మహర్షి స్కూల్ ఆవరణలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, వీజేఎస్ విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. దీంతో యాజమాన్యానికి విద్యార్థి సంఘాల నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు, విద్యశాఖ అధికారులు చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం అధికారులు కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, పుస్తకాలను సీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్మడమే కాకుండా విద్యార్థి సంఘాల నేతలపై మహర్షి యాజమాన్యం దురుసుగా రౌడీయిజం ప్రదర్శించింది. పోలీసులు, విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగడంతో ఎట్టకేలకు మహర్షి యాజమాన్యం తలొగ్గింది. జిల్లాలో ఎవరైనా అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు ఎస్ఎఫ్ఐ పట్ల మధు, ఏఐఎస్ఎఫ్ వెలుగు శ్రవణ్, పీడీఎస్ యూ దేవేందర్, వీజేఎస్ ఈర్ల మనోజ్, ఎస్ఎఫ్ఐ నేతలు గుగులోతు సూర్య ప్రకాష్, జ్యోతి బాస్, ఏఐఎస్ఎఫ్ నేతలు మేక వెంకటేష్, వికాస్, సాయి, కిరణ్, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీల్ ) విద్యుత్ భవన్ , హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం అన్ని సర్కిళ్ల సూపెరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీఎండీ మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే గ్రూప్-1 పరీక్షలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించేటట్లు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్ఈలను ఆదేశించారు. ప్రతి సెంటర్ కు ఏఈ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లను నియమించాలని ఎస్ఈలను కోరారు. ఈనెల జరిగే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ లో కూడా విద్యుత్ అంతరాయాలు లేకుండా అన్ని సత్వర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సీజీయం కె.కిషన్, డీఈ(టీ) కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు .

## ఐసీడీఎస్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంగన్వాడీ కేంద్రం మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు సరైన పునాది అనే పోస్టర్ ను శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, సూపర్ వైజర్ కవిత ఆవిష్కరించారు. ఐసీడీఎస్ హనుమకొండ ప్రాజెక్ట్ హౌంజిగ్ బోర్డు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో బడిబాట సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మధురిమ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణిలకు సీమంతం, 6 నెలల పిల్లలకు అన్నప్రసాన, అంగన్వాడీ కేంద్రం పిల్లల ఆనంద నిలయం అనే పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం డీడబ్ల్యూఓ మధురిమ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న 5 ఏళ్ల లోపు పిల్లలకు నూతన విద్యా ప్రణాళిక ప్రకారం పూర్వ ప్రాథమిక విద్య పాటు పిల్లల భద్రత, సంరక్షణ చూస్తూ నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ, తెలుగు, ఇంగ్లీష్ నేర్పడం, పిల్లల సమగ్రాభివృద్ధి, నైపుణ్యత, పోషకాహారం అందిస్తూ పిల్లల బంగారు భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు తోడ్పడే విధంగా పనిచేయాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అంగన్వాడీ టీచర్ సరస్వతీ, అయా స్వప్న, వినోద, ధనలక్ష్మీ, అశాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఎలగందుల వృద్ధాశ్రమంలో ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోంగోపాలపురం (రంగశాయిపేట్) గ్రామం ఎలగందుల వృద్ధాశ్రమంలో వయోవృద్ధలకు ఉచిత ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా నెలకు సరిపడా మందులు అందించటం జరిగిందని పాలకవర్గం తెలిపింది. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు జి.కిషన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, ఎలగందుల లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపల్లి శివకుమార్, జి.గంగాధర్, పవన్, రమేష్, రాజు వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకులు ఒడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, కేరళ తరహాలో మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షచ కార్యదర్శులు మండ రాజన్న, అల్వాల వీరయ్య, కుర్ర మహేష్ శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న అధ్యక్షతన జరగగా



సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య పాల్గొని ప్రసంగించారు. ఉపాధి హామీ చట్టంలో బీజేపీ ప్రభుత్వం ఎన్ఎంఎస్, ఏబీపీఎస్ యాప్ ను తీసుకొచ్చి పేదల నోట్లో మట్టి కొట్టిందన్నారు. కొలతలు లేకుండా పని కల్పించాలని చట్టం చెబుతుంటే కొలతలు పెట్టి కనీస వేతనం పడకుండా రోజుకు రూ.150 నుంచి 200 వేతనం కూడా ఇవ్వటం లేదని మండిపడ్డారు. చట్టంలో పలుగు, పారలు, ఫస్ట్ ఎయిడ్ కిట్టు, మంచినీరు, సమ్మర్ అలవెన్స్ ఇవ్వకుండా, కేంద్రంలో 10 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వం ఉపాధి నిధులు తగ్గించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీల పోరాటంతో వచ్చిన చట్టాన్ని గత పది సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టానికి తూట్లు పొడిచారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పేదల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 6 గ్యారంటీలు తక్షణమే అమలుకు పూనుకోకపోతే కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్, కొడం చంద్రకళ, గుడిశాల వెంకన్న, వంగూరు వెంకటేశ్వర్లు, బాణాల రాజన్న, ఎండీ యాకూబ్, ప్రశాంత్, సుజన, నగన్య, పెరుమాండ్ల సమ్మయ్య, ఉమాలక్ష్మీ, అలివేలు, ప్రియాంక, రమణ, వేణు, కాంతమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత

### ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఈ నెల 9న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున్న అన్నిరకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 సెంటర్లలో మొత్తం 4412 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అత్యవసర సేవలకు గాను ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ సిబ్బంది ఉంటారని, రెండు, మూడు సెంటర్లకు ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి విలులేదన్నారు. ఎగ్జామ్స్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచనలు చేశామన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

# విదేశాల్లో కల్కి క్రేజీ అదుర్స్

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల బుకింగ్

సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓవర్సీస్‌లో ఈ సినిమా జూన్ 26నే విడుదల కానుంది. అక్కడ దీని అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. విదేశాల్లో ఈ చిత్రాన్ని 124 లొకేషన్లలో విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు 116 థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా ఒక్కరోజులోనే 4933 టికెట్స్ అమ్ముడయ్యాయి. త్వరలోనే థియేటర్ల సంఖ్య పెంచనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన తన బ్లాగ్‌లో షేర్ చేసిన ఓ అప్‌డేట్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. 'మరో బిజీ డే. నా అప్‌కమింగ్ సినిమాలోని పాటకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నాను. త్వరలోనే అది మీ ముందుకు రానుంది' అని తెలిపారు. దీంతో కల్కి (ఐజీ÷ఖతి 2898 ంఆ) పోస్ట్ ప్రొడక్షన్ పనులే అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రబృందం కూడా అమితాబ్‌కు సంబంధించిన కొత్త పోస్టర్‌ను పంచుకొని జూన్ 10న ట్రైలర్ రానున్నట్లు తెలిపింది. ప్రభాస్ (ఖసజీశిరజీబ) సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే పశుపతి, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# కన్నప్ప టీజర్ 14న విడుదల

అత్యంత భారీ నిర్మాణవ్యయం, అత్యాధునిక సాంకేతికతో రూపొందుతున్న ఫాంటసీ డ్రామా 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కథానాయకుడు విష్ణు తెలిపారు. ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టారు. 'కేన్స్‌లో అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత ఈ విషయాన్ని మీతో పంచుకోవడానికి ఎంతో థ్రిల్‌గా అనిపిస్తోంది. పురాణగాథ 'కన్నప్ప' మూవీ టీజర్‌ను జూన్ 14న మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ చిత్రానికి నా గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఇక కన్నప్ప ప్రపంచంలోకి మిమ్మల్ని ఆహ్వానించకుండా ఉండలేను' అని పేర్కొన్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ పాల్గొన్నారు. అక్షయ్ ఈ చిత్రంలో శివుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. నందీశ్వరుడి పాత్రను ప్రభాస్ పోషించనున్నట్లు ప్రచారం సాగుతోంది. వీరితో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది.



# లవ్, ఎమోషనల్ కలబోత..



టాలీవుడ్ యువ కథానాయకుడు శర్వానంద్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కెరీర్ ప్రారంభం నుంచే 'గమ్యం', 'యువసేన', 'అమ్మ చెప్పింది', 'వెన్నెల' సినిమాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకున్నాడు. శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మనమే' . కృతి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ ఎలావుందో ఓసారి లుక్కేద్దాం..

విక్రమ్ (శర్వానంద్) లండన్‌లో మద్యం, మగువలే జీవితంగా లైఫ్‌ను ఆస్వాదిస్తుంటాడు. సుభద్ర (కృతిశెట్టి)కి కార్తీక్ (శివ కందుకూరి)తో నిశ్చితార్థం జరుగుతుంది. ఇలాంటి సమయంలో తాను ప్రాణంగా ప్రేమించే స్నేహితుడు అనురాగ్ (త్రిగుణ్) దంపతులు యాక్సిడెంట్‌లో మరణిస్తారు. అయితే అనురాగ్ రెండేళ్ల కొడుకు విక్రమాదిత్య బాధ్యతలు విక్రమ్, సుభద్రపై పడుతాయి. దాంతో యూకే దత్తత నిబంధనల ప్రకారం కేర్ టేకర్స్ ఇద్దరు ఒకే ఇంటిలో కలిసి ఉండాలనే నిబంధన కారణంగా విక్రమ్, సుభద్ర ఒకే చోట నివసించాల్సి వస్తుంది. ఆ క్రమంలో వారిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఎలాంటి బాధ్యత లేని యువకుడు తన స్నేహితుడు కోసం తనకు సరిపడని రెస్పాన్స్‌బిలిటీ మోయాల్సి రావడం, అప్పటికే పెళ్లి నిశ్చితార్థం జరిగిన యువతితో కలిసి ఓ యువకుడు ఉండాల్సి రావడం.. వారి మధ్య ప్రేమ చిగురిస్తే.. కామన్‌గా ఆ ఇద్దరు కలవడమనేది కామన్ పాయింట్. అయితే ఆ కథను డెస్టినేషన్‌ను ఎంత బలంగా చెప్పారు. ఎంత ఎమోషనల్‌గా కథను నడిపించారనే విషయంపై సినిమా విజయం ఆధారపడి ఉంటుంది. అయితే దర్శకుడు రాసుకొన్న కథ, స్క్రీన్ ప్లే రొటీన్‌గా ఉన్నప్పటికీ.. రాసుకొన్న సన్నివేశాలు, డైలాగ్స్ బాగుండటం ఈ సినిమాకు బ్యూటీగా నిలిచాయ.

ఇక ఫస్టాఫ్ సరదాగా, రొమాంటిక్‌గా గడిచిపోయినప్పటికీ.. సెకండాఫ్ కొంత డ్రాగ్ చేసినట్టు ఉంటుంది. హీరో, హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ బాగా వర్కవుట్ కావడం వల్ల సినిమా యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉందనే ఫీలింగ్ కలుగుతుంది. ఇక శర్వానంద్ ఇలాంటి రొమాంటిక్, భావోద్వేగమైన పాత్రలను గతంలో చాలానే చేశాడు. కానీ ప్లేబాయ్, రొమాంటిక్ ఫెల్లోగా చూపించిన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ కొత్తగా ఉంది. ఇక కృతిశెట్టి, ఆయేషా ఖాన్ పాత్రలు గ్లామర్‌తో ఆకట్టుకొన్నాయి. కృతిశెట్టి ఎమోషనల్ పాత్రలో ఒదిగిపోయింది. కార్తీక్‌గా శివ కందుకూరికి ప్రమోషన్ లాంటి క్యారెక్టర్ లభించింది. సుదర్శన్, రాహుల్ రామకృష్ణ ఇతర క్యారెక్టర్లు రొటీన్‌గానే ఉన్నాయి. మిగితా పాత్రల్లో నటించిన వారందరూ ఒకే అనిపించారు. ఇక టెక్నికల్‌గా ఈ సినిమాకు సినిమాటోగ్రఫి, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, డైలాగ్స్ ప్లస్ పాయింట్. ఈ సినిమా ఫీల్ గుడ్‌గా అనిపిస్తే.. అందుకు కారణం డైలాగ్స్. రిచ్ లొకేషన్లు, ఆర్ట్ విభాగం పనితీరు బాగుంది. పీపుల్స్ మీడియా, విశ్వప్రసాద్ అనుసరించిన నిర్మాణ విలువలు బాగున్నాయి. లవ్, రొమాంటిక్, ఎమోషనల్ అంశాలు కలిసి ఉన్న చిత్రం మనమే.



# రామ్‌చరణ్ ఫ్యాన్‌గా మారిన అలెగ్జాండర్ అలెక్స్

గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సూపర్ క్రేజ్ సంపాదించుకొని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న అతి కొద్ది మంది టాలీవుడ్ యాక్టర్లలో ఒకడు రాంచరణ్ . ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో వరల్డ్‌వైడ్‌గా అదిరిపోయే స్టార్ ఇమేజ్‌తో గ్లోబల్ స్టార్‌గా మారిపోయాడు. రాంచరణ్‌కు ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు అభిమానులుగా మారిపోయారని తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో అమెరికన్ పాపులర్ డీజే బ్యాండ్ ది చైన్ స్మోకర్స్ చేరిపోయింది. ది చైన్ స్మోకర్స్ మెంబర్ అలెగ్జాండర్ అలెక్స్ ఓ షోలో ఈ విషయాన్ని చెప్పాడు. మీకు ఒకవేళ అవకాశమొస్తే ఏ బాలీవుడ్ లేదా భారతీయ నటుడితో పనిచేయాలనుకుంటున్నారు.. అని ది చైన్ స్మోకర్స్ మెంబర్ అలెగ్జాండర్ అలెక్స్ పాల్‌ను అడిగాడు యాంకర్. దీనికి రాంచరణ్ అని సమాధానం ఇచ్చాడు అలెక్స్ . ఆర్‌ఆర్‌ఆర్‌లో నమ్మశక్యం కాని యాక్టింగ్‌తో అదరగొట్టేశాడని అన్నాడు. ఈ కామెంట్స్‌తో రాంచరణ్ క్రేజ్ ఏ రేంజ్‌లో పెరిగిపోయిందో మరోసారి అర్థమవుతుంది. రాంచరణ్ ప్రస్తుతం ఆర్‌సి 15గా వస్తోన్న గేమ్ చేంజర్ షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నాడని తెలిసిందే. మరోవైపు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆర్‌సీ 16గా స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్–మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. దీంతోపాటు హోం బ్యానర్ సుకుమార్ రైటింగ్స్‌పై సుకుమార్ దర్శకత్వంలో ఆర్‌సీ 17లో కూడా నటిస్తున్నాడు.

# ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతా..

**నా విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు**

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ ఎన్నికలో నా గెలుపు కోసం కష్టపడి పని చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాపై నమ్మకంతో నాకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు డాక్టర్ కడియం కావ్య పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలన్నింటిని నేరవెర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చెస్తానని ఆమె హామీ ఇచ్చారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ అమలు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ



నిర్మాణం, కాజీపేట రైల్వే జంక్షన్ ను డివిజన్ గా ఏర్పాటు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ భూపాలపల్లి నేషనల్ హైవేను ఇండస్ట్రీయల్ కారిడర్ గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రకృతి వనరులు పుష్కళంగా ఉన్నాయన్నారు. బొగ్గు గనులు, సారవంతమైన నెలలు, అటవీ సంపద, గోదావరి నది వంటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతానన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు అందరితో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తానన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో భారత దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం, ప్రజా సమస్యలను పరిష్కరించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. జిల్లా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అందరి సహకారంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి పాటుపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎవరెన్ని ఆరోపణలు చేసినా, సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడిన ప్రజలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు చూసి ఓటు వేశారన్నారు.

# పార్లమెంటులో ప్రజల గొంతుకనై నిలుస్తా

**భారీ మెజారిటీతో గెలిపించిన సీపీఐకి ధన్యవాదాలు**

**సీపీఐ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ కడియం కావ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పార్లమెంటులో వరంగల్ ప్రజల గొంతుకనై నిలుస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని ఎంపీగా గెలిచిన కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి ఎన్నికలలో సహకరించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు ఎన్నికలలో తనను భారీ మెజారిటీతో సీపీఐ శ్రేణులు గెలిపించారని అన్నారు. తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సీపీఐ కార్యకర్తలు భారీ మెజారిటీతో గెలిపించినందుకు వారందరికీ దన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. పార్లమెంటులో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో పేదలు, గుడిసె వాసులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మట్టికరిపించేందుకు సీపీఐ కార్యకర్తలు గట్టిగా కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ గెలుపులో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. పార్లమెంటులో ఈ ప్రాంత సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, పి.సుగుణమ్మ, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్కే. బాష్ మియా, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.




**సీపీఎం కార్యాలయంలో..**

హనుమకొండ రాంనగర్ లోని సీపీఎం కార్యాలయాన్ని వరంగల్ ఎంపీగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ నాయకులు వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సారంపల్లి వాసుదేవ,రెడ్డి, చక్రపాణి, చుక్కయ్య, ప్రభాకర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, గొడుగు వెంకట్, వి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# రోగులే లక్ష్యంగా చోరీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి మహిళా రోగులను లక్ష్యంగా చేసుకొని గొలుసు చోరీ లకు పాల్పడుతున్న మహిళా దొంగ ను మట్టేవాడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మహిళా కిలాడీ నుంచి పోలీసులు రెండు లక్షల యాభై వేల రూపాయల విలువైన 35 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ కు సంబంధించి వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ వివరాలు వెల్లడిస్తూ కరీంనగర్ జిల్లా ముల్కనూర్ కు చెందిన తురసటి శారద (50) సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో చికిత్స కోసం ఒంటరిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి రోగులతో పరిచయం పెంచుకునేది. వారితో చనువుగా ఉంటూ సదరు మహిళా రోగులను నిందితురాలు నిర్మానుష్యమైన ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడ మహిళా రోగులను అదును చూసుకొని బెదిరింపులు పాల్పడంతో పాటు కొట్టి వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకునేది. ఇదే తరహాలో నిందితురాలు గత నెల 28న చికిత్స కోసం ఎంజీఎంకు వచ్చిన మహిళా రోగి వద్ద బంగారు గొలుసును చోరి చేసింది. ఈ సంఘటనపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన మట్టేవాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇన్ స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసులకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకొని మట్టేవాడ నిందితురాలిని గుర్తించడం జరిగింది. నిందితురాలు మరోమారు చోరీ చేసేందుకు ఎంజీఎంకు వచ్చినట్లుగా పోలీసులకు పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ విఠల్ తన సిబ్బందితో వెళ్లి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా నిందితురాలు నేరాన్ని అంగీకరించింది. గతంలో ఎల్కతుర్తి, హుజురాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లుగా తెలపడంతో ఆమె ఇచ్చిన సమాచారంతో చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకొని మహిళా దొంగను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిందితురాలిని పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టేవాడ ఇన్ స్పెక్టర్ గోపి, ఎస్ఐ విఠల్, కానిస్టేబుళ్లు ఆలీ, హరికాంత్, రాజేందర్, మహిళా కానిస్టేబుల్ రమ్యలను వరంగల్ ఏసీపీ అభినందించారు.



# అమ్మవారిని దర్శించుకున్న సురేఖ

**భద్రకాళికి ప్రత్యేక పూజలు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి మంత్రి అమ్మవారికి గజమాల, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఓడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మంత్రికి ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈఓ శేషుభారతి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామిలు, దేవాలయ సిబ్బంది, మాజీ ధర్మకర్త తొనుపునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com